సమావేశంలో మాట్లాడుతున్న విద్యా కమిషన్ మెంబర్ విశ్వేశ్వరరావు

వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించాలి

విద్యా కమిషన్ మెంబర్ విశ్వేశ్వరరావు

వరంగల్, నవంబర్ 30 : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని విద్యా కమిషన్ మెంబర్ విశ్వేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో పరిస్థితులను అధ్యయనం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వసతి గృహాల్లో కట్టెల పొయ్యిపై వంటలు చేయొద్దని, ప్రత్యేక వంట గదులతో పాటు గ్యాస్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఈవో వాసంతి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రామిరెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, జిల్లా మైనార్టీ శాఖ అధికారి మురళీధర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రేమకళ పాల్గొన్నారు.

విద్యాలయాల పరిశీలన..

కమలాపూర్ : అంబాల, కమలాపూర్‌లోని పలు విద్యాలయాలను రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరావు పరిశీలించారు. అంబాలలో అంగన్‌వాడీ కేంద్రం-3, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఎంజేపీ బాలుర, బాలికల విద్యాలయాల్లో పర్యటించారు. ఎంజేపీ బాలుర విద్యాలయంలో వంటలను పరిశీలించి భోజనం చేశారు. సమస్యలను ప్రిన్సిపాల్ రవీందర్ విశ్వేశ్వరరావుకు వివరించారు. జిల్లా విద్యాధికారి వాసంతి, డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఐసీడీఎస్ జిల్లా అధికారి రమాదేవి, ఎంపీడీవో బాబు, ఎంఈవో రాంకిషన్‌రాజు, ఎంపీవో రవి ఉన్నారు.

పాఠశాలల్లో ఎమ్మెల్యేలు కడియం, గండ్ర తనిఖీలు

ధర్మసాగర్/శాయంపేట, నవంబర్ 30 : మండలంలోని ముప్పారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనిఖీ చేశారు. వంట సరుకులు, కూరగాయాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం తరగతి గదిలోని డిజిటల్ క్లాస్ బోర్డును పరిశీలించి సిలబస్ ఎంత వరకు పూర్తి అయిందని తెలుసుకున్నారు. మెయిన్ రోడ్డు నుంచి విద్యాలయం వరకు సీసీ రోడ్డు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఎంఈవో రాంధన్, ఎంపీడీవో అనిల్ కుమార్, జీసీడీవో సునీత, ఎస్‌వో మాధవి ఉన్నారు. అలాగే శాయంపేట మండలంలోని మాందారిపేట కేజీబీవీ, శాయంపేట సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులం, మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించారు. కేజీబీవీలో విద్యార్థులకు ప్రతిరోజు ఇచ్చే పండ్లను పరిశీలించారు. అనంతరం 1400 మంది విద్యార్థులకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో ఎమ్మెల్యే గండ్ర నిద్ర చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, చల్లా చక్రపాణి, పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దూదిపాల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సైయెంట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం

మడికొండ, నవంబర్ 30 : మడికొండలోని సైయెంట్ ఐటీ కంపెనీలో శనివారం ఇంజినీరింగ్ విద్యార్థులకు డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ (బీవీఆర్ సైంట్) సహకారంతో ఇన్‌స్పిరేషన్ టు ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ పేరిట స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో సుధాకర్ పాటుకుచ్చి మాట్లాడుతూ.. ఎంతో సృజనాత్మకతతో కూడుకున్న ఈ సెషన్ సరికొత్త ఆలోచనలు, ప్రాక్టికల్ టూల్స్, వ్యూహాలను అందించి వ్యవస్థాపక వెంచర్ల ఏర్పాటు చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడొద్దు

- వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు
- విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నగరంలో ర్యాలీ

వరంగల్ : ఫుడ్ పాయిజన్ ఘటనలను నిరసిస్తూ నగరంలో ర్యాలీ తీస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

వరంగల్/దామెర/శాయంపేట/హనుమకొండ చౌరస్తా/ఆత్మకూరు, నవంబర్ 30 : విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే ప్రభుత్వ పతనం తప్పదని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి. ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటలనకు నిరసనగా శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. సుబేదారి హైస్కూల్ వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, మంద శ్రీకాంత్, ఊట్కూరి ప్రణీత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో విషాహారం వల్ల మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు విద్యా శాఖ మంత్రి లేకపోవడం సిగ్గు చేటన్నారు. పెంచిన కాస్మోటిక్, మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్టాలిన్, అరుణ్, వినయ్, రాజ్‌కుమార్, జస్వంత్, శ్రీపతి వినయ్, పవన్, అఖిల్, వంశీ, పృథ్వీరాజ్, బాలకృష్ణ పాల్గొన్నారు. హనుమకొండ ప్రభుత్వ మర్కజ్ స్కూల్, ఎల్‌బీహెచ్ఎస్, గర్ల్స్ హైస్కూల్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలను బంద్ చేయించారు. అనంతరం యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రాచకొండ రంజిత్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్‌నాయక్, ఏఐఎస్బీ జిల్లా నాయకుడు మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. స్కూళ్ల బంద్ విజయమైందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. దామెర ప్రభుత్వ పాఠశాలను డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, విద్యార్థి సంఘాల ప్రతినిధులు సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, నక్క దీక్షిత్, సాయికృష్ణ, వరుణ్, శివకుమార్ పాల్గొన్నారు. అలాగే రాష్ట్రంలో గురుకులాలు, స్కూళ్లు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ శాయంపేట మండలాధ్యక్షుడు ఇస్మాయిల్ అన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ శనిశారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందన్నారు. మాగనూర్‌లో ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థిని కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాలు, రాస్తారోకోలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విగ్నేశ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం నిధులు పెంచాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ర్యాలీ తీసి జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి తిరుపతి మాట్లాడారు. నిత్యావసరాల ధరలు పెరుగుతున్నా మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదన్నారు. ఒక్క విద్యార్థికి రోజుకు రూ.8 నుంచి రూ.10 కేటాయిస్తే ఏ రకమైన పౌష్టికాహారం తింటారని, ఈ పైసలతో కనీసం టీ కూడా రావడం లేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరుస ఘటనలు జరుగతున్నా అధికారులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సరుకుల సరఫరాలో నిర్లక్ష్యం చేస్తున్న జీసీసీ మేనేజర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలేష్, చరణ్, నాగచరణ్, అజయ్, శివమణి, జస్వంత్ పాల్గొన్నారు.

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర మహాసభలను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి నగేశ్ భీమపాక

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

హైకోర్టు న్యాయమూర్తి నగేశ్

వరంగల్, నవంబర్ 30 : భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైనదని, దాని పరిరక్షణ అందరి బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి నగేశ్ భీమపాక అన్నారు. శనివారం హరిత హోటల్‌లో జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రెండో రాష్ట్ర మహాసభలకు ఆయన హాజరై ఐఏఎల్ రాష్ట్ర పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ అమలులో కొన్ని వైఫల్యాలు ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజల హక్కులను కాపడుతున్నదన్నారు. రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న అనేక హక్కులను గుర్తించనప్పుడే సమస్యలు ఉత్పన్నమవుతాయని, వాటి పరిరక్షణకు న్యాయవాదులు ముందుండాలన్నారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ప్రజల వ్యక్తిగత జీవితానికి గోప్యత పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియన్ లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి అందరం కలిసి ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ మురళీధర్, రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌బాబు, తీగల జీవన్ గౌడ్, ఆదిరెడ్డి, జయ శ్రీనివాస్, ఓరుగంటి శేషగిరిరావు, మాధవరావు, లతీఫ్, రాములు, ఏవీ కృష్ణారావు, బొమ్మగాని శ్రీనివాస్, ఉదయ్‌భాస్కర్, భీమనాథం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- వరంగల్ క్లబ్‌లో ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 30 : కాకతీయులు పరిపాలించిన గడ్డపై జాతీయ స్థాయి టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్‌లో సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు శ్రీనివాస్‌గౌడ్ జ్ఞాపకార్థం రూ.2.50 లక్షల బహుమతితో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ నేషనల్ లెవెల్ మెన్స్ ఓపెన్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి సరదాగా ఆడారు. వరంగల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, వరంగల్ క్లబ్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, జిల్లా షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌కుమార్, టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్లా మురుగన్, జాయింట్ సెక్రెటరీ కన్నారెడ్డి పాల్గొన్నారు.

పురుషులు కు.ని ఆపరేషన్లు చేయించుకోవాలి

వరంగల్, నవంబర్ 30 : కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకొనేందుకు పురుషులు ముందుకు రావాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. శుక్రవారం వేసెక్టమీ పక్షోత్సవాల సందర్భంగా ఆశ, నోడల్ పర్సన్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై పురుషులకు అపోహలు ఉండాల్సిన అసవరం లేదన్నారు. ప్రోగ్రాం అధికారి లలితాదేవి, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, ఎస్‌వో ప్రసన్నకుమార్, హెచ్ఈఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నువ్వు లేని లోకంలో నేను ఉండలేను..

5 రోజుల క్రితం భార్య, నిన్న భర్త మృతి.. గాంధీనగర్‌లో విషాదం

రాజమ్మ,

మల్లయ్య(ఫైల్)

భీమదేవరపల్లి, నవంబర్ 30 : అనారోగ్యంతో భార్య ఏనుగుల రాజమ్మ (72) ఐదు రోజుల క్రితం చనిపోగా, మనోవేదనతో ఆమె భర్త మల్లయ్య (78) శనివారం మృతి చెందిన విషాద ఘటన గాంధీనగర్‌లో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాజమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ 5రోజుల క్రితం మృతి చెందింది. అలాగే అనారోగ్య సమస్యలతో పాటు బాధపడుతున్న మల్లయ్య భార్య మృతిని జీర్ణించుకోలేక పోయాడు. దాంపత్య జీవితంలో ఇద్దరం ఎన్నో కష్టాలు పడ్డామని, చేతిలో నూకలు లేని సమయంలో పస్తులున్నామని ఇంటికి వచ్చిన వాళ్లతో చెప్పుకుంటూ కుమిలి పోతూ శనివారం మల్లయ్య మృతి చెందాడు. మల్లయ్యకు కొడుకు, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

సింహగర్జన సభను విజయవంతం చేయండి

కాజీపేట, నవంబర్ 30 : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగే మాలల సింహగర్జన భారీ బహిరంగ సభను మాల కులస్తులు విజయవంతం చేయాలని పట్టణ తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ కోరారు. బాపూజీనగర్ పోచమ్మగుడి ప్రాంగణంలో శనివారం తేజోమయి మాల కులస్తుల సమావేశం జరిగింది. విజయ్‌కుమార్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్

ఆర్ఎస్పీపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు వీరేందర్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 30 : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు బీ వీరేందర్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యకేంద్రం జాఫర్ నిజాంహాల్‌లో స్వేరోస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేందర్ మాట్లాడుతూ.. మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గురుకుల హాస్టళ్లలో పరిస్థితులు అధ్వనంగా మారాయన్నారు. ప్రపంచంలో పేరు పొందిన హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకొని దళిత, గిరిజన, బహుజన బిడ్డలను అభివృద్ధి లక్ష్యంగా చేసుకొని తన ప్రతిష్టాత్మకమైన పోలీస్ శాఖను వదులుకొని గురుకులాల సెక్రటరీగా 9 సంవత్సరాలు సేవలందించిన ఘనత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌దని, అలాంటి వ్యక్తి గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ కావడానికి కారణమని మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో గురుకులాల బాట కార్యక్రమం చేయాలని కేటీఆర్ చెప్పడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుట్టిందన్నారు. బీఆర్ఎస్ యూత్ నాయకులు మంద శ్యామ్, చాతల్ల వేణుగోపాల్ చక్రి, స్వేరోస్ నాయకులు శనిగరపు శ్రీనివాస్, మారేపల్లి మనోజ్, బొట్ల ప్రశాంత్, ఎల్తూరి సాయికుమార్, వడ్లకొండ ప్రసాద్ పాల్గొన్నారు.

చదువు, ఆరోగ్యంతో పాటు భద్రత అవసరం

వరంగల్, నవంబర్ 30 : బాలబాలికలకు చదువు, ఆరోగ్యంతో పాటు భద్రత అవసరమని ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం కాళోజీ కళాక్షేత్రంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పేరుతో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు ఇబ్బందికర పరిస్థితిల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కి కాల్ చేసి చెప్పాలన్నారు. చదువుపై దృష్టి సారించాలని, స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియాను పక్కకు పెట్టాలన్నారు. అనంతరం చెస్ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ 2వ ర్యాంకర్ అర్జున్‌ను సన్మానించారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి..

నగరంలో మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎంపీ కావ్య అన్నారు. శుక్రవారం 59వ డివిజన్ కనకదుర్గ కాలనీలో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు, డైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాయినితో కలిసి ప్రారంభించారు. కాలనీలో సీనియర్ సిటిజన్స్ కోసం పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

కేయూ అభివృద్ధిపై సమీక్ష..

హనుమకొండ చౌరస్తా : కేయూ భూములపై నిష్పక్షపాతంగా ఎంక్వయిరీ జరపాలని, చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో కేయూ అభివృద్ధిపై పరిపాలనా భవనంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు సమీక్ష నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. గ్రేటర్ వరంగల్, ఎంజీఎం దవాఖాన, కేయూ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించామన్నారు. వచ్చే నెల 23న మళ్లీ సమావేశం నిర్వహిస్తామన్నారు. యూనివర్సిటీలో మహిళల డైనింగ్ హాల్, నూతన భవనాల నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ఈసీ మెంబర్స్ అనితారెడ్డి, సురేశ్‌లాల్, రమ, పుల్లూరు సుధాకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని

ప్రతిభను గుర్తించాలి..

హనుమకొండ చౌరస్తా : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంపీ కావ్య అన్నారు. ప్రశాంతనగర్‌లోని తేజస్వీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ముగిసింది. డీఈవో వాసంతి, అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ పరిశీలకుడు సుబ్రత్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌స్వామి, క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఈవో విజయ్‌కుమార్, తేజస్వీ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కేయూ హాస్టల్ డైరెక్టర్‌పై వీసీ, రిజిస్ట్రార్ ఆగ్రహం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 30 : కాకతీయ యూనివర్సిటీ మహిళా హాస్టల్ విద్యార్థినులు భోజనం బాగా లేదని ఆందోళనకు దిగడంపై హాస్టల్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌పై వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి భోజనం సయంలో మాడిన అన్నం, రుచిలేని పప్పు, నీళ్లచారు పోస్తున్నారని విద్యార్థినులు కేయూ మొదటిగేటు వద్ద నిరసన తెలపడంపై వారు ఆరా తీశారు. ఇలాంటి మళ్లీ జరగకుండా చూసుకోవాలని హాస్టల్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌ను హెచ్చరించినట్లు తెలిసింది. కాగా, ఈ విషయంపై ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్, కేఆర్ నాగరాజుకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వెంటనే వారు యూనివర్సిటీ ప్రాంగణంలోని కామన్ మెస్‌ను పరిశీలించారు. నాణ్యత పరిశీలించి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

కేయూ సోషియాలజీ విభాగాధిపతిగా స్వర్ణలత

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 30 : కేయూ సోషియాలజీ నూతన విభాగాధిపతిగా స్వర్ణలతను నియమిస్తూ రిజిస్ట్రార్‌మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య శ్రీనివాస్ ఉద్యోగ విరమణతో ఈ ఖాళీ ఏర్పడింది.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్

వరంగల్, నవంబర్ 30 : బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ డీఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ టవర్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జయ కాలేజీ, పద్మాక్షి కాలనీ, శివముక్తిధామం, రాజ్‌పుత్ వాడ, మల్లికాంబ మనోవికాస కేంద్రం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్, నవంబర్ 30 : ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. 1న విద్యా శాఖ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల రెండో దశ నిర్మాణ పనులకు శంకస్థాపన చేస్తామని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు స్వీట్ల పంపిణీ, వ్యాసరచన పోటీలు, సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తామన్నారు.

అర్బన్ డే ఘనంగా నిర్వహించాలి : మేయర్

వరంగల్ : ఈ నెల 3న అర్బన్ డే ఘనంగా నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం కార్పొరేషన్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలోని కూడళ్లు, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాలు, కలెక్టరేట్, కోర్టులను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. అర్బన్ డేలో భాగంగా 3న 2కే రన్, ఉదయం 10 గంటలకు బల్దియా ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించి మందులు, పీపీ కిట్లను అందజేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. అధికారులకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించి అర్బన్ డే విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ప్రసన్నరాణి, హార్టికల్చర్ అధికారి రమేశ్, బయలాజిస్ట్ మాధవరెడ్డి, టీఎంసీ రమేశ్ పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి

దామెర/మడికొండ, నవంబర్ 30 : మండలంలోని కోగిల్వాయి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి మాట్లాడుతూ.. గ్రామాల్లోని అణగారిన వర్గాలు తమ హక్కుల విషయంలో ఎటువంటి సందేహాలు ఉన్నా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కులంపేరుతో దూషిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో ఎస్సై కొంక అశోక్, విద్యుత్ ఏఈ రమేశ్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సరళ పాల్గొన్నారు. పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ అన్నారు. అమ్మవారిపేట ప్రభుత్వ పాఠశాలలో ఆయన పౌర హక్కులపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ బావుసింగ్, ఎంఈవో మనోజ్ కుమార్, మెడికల్ హెల్త్ సూపర్‌వైజర్ వల్లభాయ్ పటేల్ పాల్గొన్నారు.

**గుడుంబా, బెల్ట్ ష